భమిడిపాటి రామగోపాలం

శృంగార సర్పం

"పలుకు తేనెలతల్లి పవళించెను—
కలికితనముల విభుని కలసినదిగాన!'
అది అన్నమాచార్యులవారి మధు గీత
ఆ గీతం యిక్కడ అనువర్తించదు
ఈ "లక్ష్మి" కూడా "పవళించింది!''
కాని కలికితనం"లేదు కరుకుదనమే!

"అలనిసోలని కలికిరూపం
ఆర్పివేయగ కోర్కెదీపం
నిదుర రామిని మాధవునికి
చెదరెమది యెంతో—
అది ఎవరో పూర్వకవి గీతంలోని
శకలం

రాఘవులు మంచంమీది నుంచి లేచాడు లక్ష్మిని చూద్దామని అంతకుముందు వెలిగించిన జీరోవాట్ దీపం ఆర్పేసి పద కొండున్నర గంటల ఆ రాత్రప్పుడు డాబా మీదికి వెళ్ళాడు

రెండేళ్ళయినా సరే, ఎందుకో లక్ష్మికి ఈ రసం అనుభవైకవేద్యం కాలేదు

'నానుంచి ప్రయత్నలోపంయేమీలేదు!' అని అయిదువందల తొంభయ్యోసారి స్థిరంగా నిశ్చయంగా అనుకున్నాడు

ఎవరది రాఘవులేనా? ప్రశ్నవిని పక్కింటి డాబామీదికి చూశాడు

ఆ పలకరింపు అమీర్ అహ్మద్‌ది

'నేనే అమీర్!'

ఏం కథా? నిద్రరాలేదా?

'ఏకులాగానే'

"నాతో పోల్చుకోడం అంత ఆరోగ్యం కాదు భాయ్ అమీర్ చప్పుడు చేస్తూ నవ్వాడు ఇటువేపు వచ్చేస్తావా? బల్ల తెస్తానుండు!'

పక్కపక్కనేఉన్న ఆ రెండు డాబాలూ ఒకే ఎత్తు క్రిందిగదులు ప్రహరీగోడకి అయిదేసి అడుగుల దూరానుండేట్టు కట్టినా, డాబాలు రెండూకూడా మూడేసి అడుగులు పక్కింటివేపుగా వ్యాపించేటట్టు కట్టుకున్నారు ఇద్దరు వోనర్లూ ఎవరికి వారే

అప్పుడెప్పుడో చిన్నప్పుడు ఒకే గదిలో ఉండి ఒకే కాలేజిలో ఒకే క్లాసులో వుంటూ నాలుగేళ్ళపాటు చదువుకున్న ఆ స్నేహితులిద్దరూ వేర్వేరు రంగాల ఉద్యోగాలు చేసుకుంటూ పదిహేడేళ్ళపాటు ఎడబాసి మొన్నసీమధ్యనే మళ్ళాఇక్కడ కలుసుకొన్నారు వాళ్ళిద్దరూ ఈ ఊరికి ఉద్యోగరీత్యా చేరింది ఒకే నెలలో ఇద్దరూ ఈపేటలోనేఅద్దెయిళ్ళకోసం వేట సాగించి, కాకతాళీయంగా పక్కపక్కయిళ్ళు నిరుకు చేసుకున్నారు

పక్కయింట్లో యెవరున్నారో తెలుసుకోకపోవడం 'నాగరికం' ఐనా అలా నెలరోజుల కన్నా ఆగలేకపోయాడు రాఘవులు కారణం రోజూ తను కాలేజి నుంచి ఇంటికొచ్చే వేళకి ఒక స్పోర్ట్స్

సైకిల్ తొక్కుకుంటూ వొచ్చే ఆకు(
వాడు కాలేజీలో అప్పుడప్పుడు క
బడుతూనే వుంటాడు, గేదెల తొ
మధ్యని ఆవులాగా కాని అతగాడు త
స్టూడెంట్ కాదు
ఆ కుర్రవాడిలో (మహమ్మదీయు ల
ణాలు ముందే కనబడుతున్నాయి) అపీ
అహ్మద్ పోలికలున్నా కనబడ్డంచే
యామైతే బందిలే అని పలకరించేగా



రాఘవులే
జవాబుగా, "మా డాడీ పోలీస్ ఇన్స్
క్టర్ మాది ఢిల్లీ మా నాన్నగారి పే
అపెర్ అహ్మద్" అని ఆ కుర్రాడ
చెప్పేడు
పద్దెనిమిదేళ్ళుట బి ఏ ఫస్టియర్ చదు

తున్నాడు. పేరు కలామ్. ఒక చెల్లెలు; నూరున్నీసాట, పదోక్లాసు చదివి మానేసింది. ఇంకో తమ్ముడు జఫ్రాలీట. తొమ్మిది చదువుతున్నాట్ట. వాడు పుట్టినప్పుడే వాళ్ళమ్మ పోయిందట.

అన్నీ విన్నాక అమీర్‌ని పలకరించాలని మరింతగా కలిగింది, కోరిక రాఘవులికి. కాని ఒకహత్యకేసు దర్యాప్తులో చిక్కుకున్న అమీర్, ఆ మర్నాటి రాత్రి పదకొండు గంటలకి గాని కళ్లు చేసే లేదు. ఆ యెడబాటు భరించలేక పోయాడు రాఘవులు.

ఇంటికి రాగానే రాఘవులి సంగతి కొడుకు చెప్పగా విన్నాడు అమీర్. కాని ఆ పదకొండు గంటల రాత్రప్పుడు రాఘవుల్ని నిద్రలేపడమా అని సంకోచం కలిగింది అంతలోనే; పక్కయింటి గేటుదగ్గర లీలగా ఏదో శబ్దం వినిపించింది, ఆ పోలీస్ చెవులకి.

రాఘవులికి ఆ మోటార్ సైకిల్ చప్పుడుతో పరిచయం అయి పదిహేను రోజులే అయింది. అయినా ఆ విలక్షణమైన ధ్వని అతన్ని ఎంతగా ఆకర్షించిందంటే; అతను; "ఇదొకటి నేర్చారు. మధ్యలో లేచిపోవడం" అన్న లక్ష్మి మాటల్ని కాతరు చెయ్యకుండా వొంటికి లుంగీ గట్టిగా చుట్టబెట్టుకుని, ఒక గది తలుపూ ఒక వరండా తలుపూ తెరిచి, తల్లికి మెలుకువ రాకుండా జాగర్త పడుతూ; అమీర్ మోటార్ సైకిల్‌కి స్టాండేసే లోపుగా తన ఇంటి గేటు దగ్గిరున్నాడు...

....

డాబామీద వున్న గదికి పక్కనే విడిగా స్నానపుగదీ మరుగుదొడ్డీ వుండడాన్ని; అది అమీర్ ప్రయివేటు రూమైంది. మంచం, టేబుల్, ఫ్యాను, రిఫ్రిజిరేటర్ పుస్తకాలు, బట్టలు, ఫాన్‌కోసం ప్లగ్ సాకెట్టు. "మూడు వందల అరవై రోజులూ ఇరవై నాలుగేసి గంటలుకూడా చేతినిండా పనుంటు ది గనకా సరిపోయింది గానీ, లేకపోతే ఈ ఒంటరి బ్రతుకు దుర్భరం భాయ్" అంటాడు. పనిలో ఒత్తిడి బాగా ఎక్కువైనా, బొత్తిగా ఖాళీగావున్నా ఆ గదిలో అతనొక్కడే కూర్చుని మద్యపానం చేయగలడు. ఎప్పుడైనా గాలి మళ్ళితే వొక "ఆ డ తో డు" ను ర ప్పిం చు కో వడం కద్దు. పక్కయింట్లో రాఘవులు ఉన్నాడని తెలిసినప్పటినుంచి చదరంగం ఆట సాగుతోందక్కడ. అమీర్ చదరంగంలో మంచి ఆశ్వికుడు పట్టుమని నాలుగెత్తులయినా పడకముందే రాఘవులి ఆట సిరస పడిపోయిందని తేలిపోయింది.

"జీవిత సార్థవాహము విచిత్రగతిన్
పయనించు; నందులో
నీవొక రెప్పపాటయిన నెయ్యురతో
సుఖముందు వేని
మోదావహ మంతకన్న కలదా?
మధుపాత్రిక నందియుమ్ము
సాకీ! వివరించెదేల తిలకింపని
రేపు నెరేయి జారెడిన్"

అంటూ అంటుకుని ఉమర్‌ఖయ్యాం రుబాయీకి కవికోకిల రామిరెడ్డిగారి తెలుగుసేతలోంచి కమ్మని పద్యాలు చదవడం మొదలు పెట్టాడు అమీర్.

ఖమాస్, పూరబి, దేశి, ముల్తానీ, బేహాగ్ పీలూ లాంటి హిందూస్తానీ రాగాల్లో,

సంగతులూ దీర్ఘాలూ మోపు చెయ్యకుండా భావానికి ప్రాణంపోస్తూ అతనలా ఎన్ని పద్యాలైనా చదవగలడు అంతే కాదు. పారశీక మూలంనుంచి ఎడ్వర్డ్ ఫిజ్‌గెరాల్డ్ ఆంగ్లానువాదం నుంచి, ఆ పద్యాలెలా వెలువడ్డాయో ఆ స్వారస్య వివరమేమిటో చెప్పి కవికోకిల తీయని పలుకులను మెచ్చుకుంటూ శకలాలు శకలాలుగా సమాసాలు, సమాసాలుగా దండాన్వయం చెయ్యగలడు.

అంతకుముందే రాఘవులు ఆట అంతంత మాత్రం. ఇహ దీంతో రేగిన కలత మరింత. అంచేత రాఘవులూ అందులోనే విజృంభిస్తాడు. "రహివుట్ట జంత్ర గాత్రముల రాల్గరగించు విమల గాంధర్వంబు విద్య మాకు" అని అల్లసాని పెద్దన మనుచరిత్రలోదో!

"-వాసోభూషణ గంధమాల్య
రచనా వైచిత్ర్య సజ్జాంగియై;
ఆ సీమంతిని అన్యకాంతయను
మిధ్యాభ్రాంతి పుట్టించుచున్
వాసాగారమునందు నొక్కతెయ
నానాభంగి వర్తించు న
త్యాసక్తిన్-విభుండామోదమున్
బొందగన్"

అని శ్రీనాథుని శృంగార నైషధంలోదో "కూడితి విక, దయలుంచరా, మువ్వగోపాల-నా మోహ మెంచరా; వేడుకయ్యాని; కౌగలించరా" అని క్షేత్రయ్య పదం లోదో,

"నిగనిగని మోమువయి,
నెఱులు గెలకులు చెదర
పగలై ... ... లి పవళించెను
తెగని పరిణతులతో తెల్లవారినదాక
జగదేకపతి మనసు జొప్పిగొనగాన"

అని అన్నమాచార్య కీర్తన లోదో! పద్యమో శ్లోకమో గేయమో అందుకుని, సమర్థవంతమైన వ్యాఖ్యానం నిర్వహిస్తాడు రాఘవులు

"వహ్వా! వహ్వా!" అనీ, "సుభానల్లా!" అని కరతాళ ధ్వనులు చేస్తాడు అమీర్. ఇంకా సరదా తీరకపోతే రాఘవులు భుజం మీదనో, నడుం మీదనో చరుస్తాడు. మరీ అయితే అతన్నోసారి కావిలించుకునే తన బాణీలో మెచ్చుకుంటాడు "ధన్యుడవురా, మిత్రమా!" అని అరుస్తాడు. "గో! హేవ్ ఎ నైస్ టైమ్!" అని రాఘవులికి వీడ్కోలిచ్చి రెండు డాబా గోడలకీ మధ్య బల్ల చెక్క వంతెన ఎక్కించి పంపేస్తాడు.

ఆ మాటల్లోంచి "గొ హేవ్ ఎన్ ఐస్' టైమ్" అనీ వినిపిస్తుంది రాఘవులికి. బల్ల చెక్కయెక్కి డాబా మారి మెట్లు దిగి, మెట్ల గది తలుపు మూసి పడక గదిలో కెళ్ళి, జీరో వాట్ బల్బ్ వెలిగించి అక్కడ కరగని "ఐస్" గడ్డలా నిద్రిస్తున్న ఇల్లాల్ని చూసి, దీపం ఆర్పేసి మంచంమీద ఆమెకి తగలకుండా ఒదిగి పడుకుంటాడు రాఘవులు.

"అలికిడైతే చాలు, ఆసతో నా కనులు వెదికేను నలుదెసల, అతడేమొ"

అనుకొని-కనులూ చేతులూ తెరవ వలసిన సీతారామలక్ష్మి మండు వేసంగిలో కూడా ముడుచుకొని పడుకోగలదని, అలికిడి కాగానే నిద్రా భంగమైనట్టు ఒళ్ళు కదిపి చిన్న మూలుగుతో ఒంటి మీదున్న వస్త్రాలన్నీ చాలనట్టు దుప్పటి లాక్కు-నిముసుగుపోసుకునిగోడవేపుతిరిగి పోగలదని రాఘవులకి ముందే తెలుసును.

....



"బి.ఏ సెకండియర్ తెలుగు పేపర్ల స్పాట్ వేల్యుయేషన్ కోసం వాల్తేర్ వెళ్ళి పన్నెండు రోజులున్నాను బ్రదర్. అట్నుంచి ఆఖ్ఖరి రోజు సాయంకాలమే వచ్చేద్దామనుకునీ కూడా, కొలీగ్స్ కోరిక ప్రకారం ఆ రాత్రి సినిమాకని ఉండిపోయాను. ఎంత మందినని కాదనడం? ఇటు ఏలూరునుంచి అటు శ్రీకాకుళం వరకు ఎందరో క్లాస్‌మేట్స్ లెక్చరర్స్ అయ్యారు.... మర్నాడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో వచ్చాను!

"ఆ బండి అంత ఖాళీగా ఉండదేమో. నేనెంచుకున్న సింగిల్ సీట్లో నేను, దానికి సరిగ్గా పక్కవేపున బార్ సీట్లో ఒక జంట, అంతే! ఆ కంపార్ట్‌మెంట్‌లో నాలుగో ప్రాణి లేదు! ఆ అమ్మాయి సుమారు పాతికేళ్ళుంటాయనుకో-అత్యద్భుత సౌందర్యవతి అంటే నమ్ము! అతను కూడా సుమారు అందగాడూ స్ఫురద్రూపీనీ. ఇహ వాళ్ళిద్దరి లీలలూ ఏమని చెప్పను? కాసేపు అతను కిటికీని ఆనుకుని కూర్చుంటే అతని ఒళ్ళో తల పెట్టి ఆవిడ పడుకునేది. కాసేపు ఆవిడ కూర్చుంటే ఆవిడ ఒళ్ళో తలపెట్టి అతను పడుకునేవాడు! ఇక అవి ముచ్చట్లు కావు, ముద్దులు కావు, సరసాలు కావు, కేరింతలు కావు, గుసగుసలు కావు! అలకలు కావు! ఎదురుగా మరో మొగవాడున్నాడని అతనికీ లేదు, పక్కనే పరపురుషుడున్నాడని ఆవిడకీ లేదు సంకోచం! అంత స్వేచ్ఛగా, నిస్సంకోచంగా హాయిగా, అట్టే మాట్లాడితే విశృంఖలంగా ఆ జంట ఆ సెకండ్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో శృంగారారంభ చర్యలకు పాల్పడ్డారు. ఆ చేష్టలు చూసి నాకు నిజంగానే మతిపోయింది.

"నాకూ మా లక్ష్మికీ పెళ్ళయి రెండేళ్ళు కావస్తోందిప్పటికి. అలా బహిరంగంగా మాట అటుంచి, ఆఖరికి కిటికీలు, తలుపులూ మూసేసుకున్న గదిలో జీరోవాట్

బిల్చ్ అయినా వెలిగించని చీకట్లో కూడా మేం ఎన్నడూఅందులో శతాంశం సహస్రాంశం కూడాచేసుకోలేకపోయాం అంటే నమ్మ్! మా వ్యవహారం అంతా నువ్వో అందుకు పోస్తున్నావంటే నేనో అందుకు తాగుతున్నానన్నట్టుగా సాగు తోంది...ఏదో వాడి పాపాన వాడే పోతాడులే అన్నట్టుగాను; పెళ్ళాడేడు, అన్నం వస్త్రం పెడుతున్నాడు గనుక వీడికైనా ఒళ్ళప్పచెప్పకపోతే భగవంతుడో సాటి మానవులో చర్య తీసుకో వచ్చు నన్నట్టుగానూ ప్రవర్తిస్తుందే తప్ప సరసం సహకారం ఎన్నడూ లేవు బ్రదర్ నాకు!

"ఆ రోజు చెప్తే నమ్మవేమోగాని అమీర్ నాకు పిచె క్కినట్టయిపోయింది సాయం కాలం వరకు ఎలా ఉన్నానో నాకే తెలీదు! వేసవి సెలవుల మూలాన్ని కాలేజ్ కూడా లేదు! మామూలుగా రాత్రి పదిగంటలు దాటాక, మా అమ్మ నిద్ర పోయాకనే లక్ష్మి నా గదిలో కొస్తుం దసలు.వచ్చినా, ఆపలిస్తూ లయబద్ధంగా చిటికెలు వేస్తూనో,తూగుతూనో వస్తుంది. నేను తన కోసం ఎదురుచూస్తూ మంచం మీదపడుకున్నానా-"జరగల్ది" అంటు ది ఆవలింతల్లోంచి ఒక టే మాట. నేను డిమ్మగా టేబిల్ లైటేసుకుని కూర్చుని పుస్తకం చదువుతున్నానా "మీ చదువై పోగానే దీపం తీసేస్తారు కదూ?" అని తన మొహానికి దీపం వెల్తురుతగలకుండా అటు తిరిగి పడుకుని దుప్పటి మొహం మీదికి లాక్కుంటుంది...

"నా పెళ్ళి చాలా లేటుగా చేసుకున్నా న్నీకు తెలుసుగదూ! అంటే, మా చెల్లెలు పెళ్ళి అయ్యేదాకా నేను "భీష్మించు" కున్నాను కదా! ఆ ముప్ఫయ్యోయిదో ఏట అయినా, పద్దెనిమిది, ఇరవై ఏళ్ళ మ్మాయినో చేసుకుంటే భయంవల్లనో ముగ్ధత్వం వల్లనో వైముఖ్యం వల్లనో తొలగిపోవచ్చు. అసహ్యించుకో చ్చు: చల్లబడిపోను వచ్చు కాని నా పెళ్ళికి నాకెలాగైతే ముప్ఫయ్యయిదేళ్ళున్నాయో మా లక్ష్మికీ ముప్ఫయొక్క సంవత్సరా లున్నాయి మరి...మరి తనెందుకిలా ప్రవర్తిస్తోందో నాకర్థమై చావదు!

"ఎన్నో శృంగార గ్రంథాలున్నాయి నా దగ్గర. సంప్రదాయ సాహిత్య విద్యా ర్థిగా, అధ్యాపకుడుగా పోగేసినవి. వాట్లో భాగాలు కధలు కథలుగా చదివి వినిపించ డానికి ప్రయత్నించేనుకొనా శ్ళు అర్థాలు చెప్పేలను కదా! 'ఛీ పొండి, ఏమిటా అసహ్యం మాట్లు" అనేసేది పురాతన చిత్రకళ ఆధారంగా తీసిన ఫోటోలు కూడా చూపి చేసు శివ శివా అని కళ్ళు మూసు కోడమే-

"సరే-ఆ రోజు సంగతి చెబుతున్నాను కదూ? ఇహ ఈ రోజు రాత్రి పడేవరకు కూడా ఆగను, సాయంకాలమే ఈ భావా నికి ముఖద్వారంగా శరీర చర్య నిర్వ హించేయాలని ఊరి హరి. మా అమ్మకి ఊళ్ళో ఆడుతున్న "భక్త అంబరీష" సినిమా గురించి చెప్పి ఆవిణ్ణి ఒప్పించి రిక్షా ఎక్కించి ఇలా ఇంటి కొచ్చేనో లేదో-మా లక్ష్మి ముందుగదిలో ఓ మూల చలికిల పడిపోయి కూచుని "ఆ చాపా చెబూ ఇలా పడేసుండి!" అంది!

"అదీ - మామూలుగా మా ఇళ్ళలో అయితే ఈ శౌచాన్ని మూడు రోజులే

పాలిస్తారా, మా లక్ష్మి ఖచ్చితంగా అయిదు రోజులు ఆపేస్తుంది. కొంద రైతే ఇళ్ళలో కలిపేసుకుంటున్న ఈ రోజుల్లోనే ఇదంతా!

"ఇలా ఎందుకు జరుగుతోంది బ్రదర్? ఇహ నా జాతకం ఇంతేనా? నేను ఇన్ని వందల శృంగార కావ్యాల్లోనూ చదివి పొందిన రసతుష్టి ప్రయోగాత్మకంగా అనుభవైక వేద్యంగా పొందే భాగ్యం నాకు కలగదా?"

అని ఓ రోజు రాఘవులు దుఃఖపడితే అమీర్ అహ్మద్ పకపకా నవ్వాడు "బలే సొసైటీలే, మనది! మా ముస్లిమ్స్‌లో కూడా కొందరింతే! మొగవాడి చేష్టలకి స్పందించినట్టు తెలిస్తే విశృంఖలత్వం ఆపాదిస్తారని ఫ్రిజిడ్‌గా మిగిలిపోతారు, నటిస్తారు తెలుసా?" ఆ నవ్వు చాలాసేపు కొనసాగింది.

"రేపు కలుద్దాం" అని రాఘవులు లేచాడు.

"రేపు ఏవేళప్పుడు కొంపకి చేర్తానో! మా యస్పీ దిగుతున్నాడు రేపు!"

o............o..............o

"నమస్కారం మేష్టారు...అబ్బ! దేవుళ్ళాగా కనిపించారండి..."

రాఘవులు దిగ్భ్రాంతి చెందాడు. అది ఎవరో మనుష్యమాత్రులు చేసిన అభివాదం కాదు...

రతియో, పార్వతియో, శచీయువతియో; రంభాంగనా రత్నమో?

కడు + ఎదుట = కట్టెదుట — నిలచి మోహనరాగంలో మీటిన హృదయ తంత్రీ నిస్వనం—

ఇప్పుడే తలచుకున్న వాళ్ళు ఇప్పుడే కనబడితే "నూరేళ్ళు ఆయుర్దాయం" అంటారు రాత్రి తలచుకున్న మనిషి తెల్లారి కనబడితే ఎన్నేళ్ళు?

"మీరు-" అనాడు; గుర్తుపట్టలేక కాదు, మరో నాలుగు సుస్వరాలు పలికించాలచే.

"మేం మీకు తెలీకపోయినా మీరు మాకు బాగాతెల్సండి...మమ్మల్ని కూడా మీరు-మర్చిపోయారు గాబోలు గానండీ, చూసేరండి ఆ రోజు రైల్లో-వాల్తేర్‌నుంచి సామర్లకోట వరకు-సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో-మనం ముగ్గురం వొకే పెట్లో గూర్చుని...ఆరోజు ఆయన్ను సాగనంపడంకోసం నేను సామర్లకోటలో దిగడిపోయానండి, తమరేమో వెంటనే టాక్సీలో వొచ్చేశారండి-"

"ఓహో, మీది ఈ ఊరేనా?"

"మాదేమో ఈఊరేనండి...... వారు కాకినాట్లో ఉంటారండి... తండ్రిచాటు బిడ్డ...అన్నీ తరవాత మనవిజేస్తాను గానండీ వారేమో యిప్పుడే పిన్సిపాల్ గారి రూమ్‌లో కెళ్ళారండి. ఇంటర్‌వ్యూకొచ్చేరండి, ఎకౌంటెంట్ ఉద్యోగానికండి" ఆ మాటల్తో ఇంకా దగ్గిరిసా వొచ్చి రాఘవులి రెండు చేతులూ పట్టేసుకుంది..."అయ్యా! అయ్యా! వారికెల్లాగయినా ఈ ఉద్యోగం రావాలండి. ఈ ఊర్లో యెవర్నడిగినా ప్రిన్సిపాల్‌గారికి మీ మాట మీదనే గురి అన్నారండి... సార్, మీరు నామీద దయవుంచి వెంటనే లోపలికెళ్ళి కలగజేసుకోవాలండి కాస్త ఆలస్యమైనా విషమైపోతుందండి ... వారికి ఇల్లాంటి పద్ధతులు తెలియవండి ...వారిక్కడ వుద్యోగం చెయ్యడం నా



కెంతో మేలండి..." అని చేతులు పది లేసి, నమస్కారంగా జోడించి "తమ రుణం వుంచుకోనండి' అన్నది. వెంటనే చేతులు మళ్ళా పట్టుకుని అతని కుడి అర చేతిలో తన బొటన వ్రేలితో నొక్కిందు. ఆ నిమిషం ఆనిమిషీయం—

ఆ సంకేతం అర్థం చేసుకోడానికి రాఘవులు, సతి సీతారామలక్ష్మికి కొంత అపచారం ద్రోహం తలపెట్టడానికి ముందుగా నిర్ణయించుకోనక్కర్లేదు. బీజం ఉన్నదున్నట్లుగా క్షేత్రప్రసక్తి లేకుండా సద్యోఫలిత-పొంది ఫల పుష్పభరితమైన వృక్షంగా మారగలిగిన క్షణం అది.

"సరే! నువ్విక్కడ కూర్చో. అయిదు నిమిషాల్లో వస్తాను" అని ఆ పక్కనున్న క్లాస్ రూమ్‌లో స్టేజిమీద వున్న కుర్చీని క్రిందికి దింపి "అతని పేరేమిటి?" అన్నాడు ప్రిన్సిపాల్ రూమ్ లోకి వెడుతూ.

౦..............౦... ....౦

ఒక్క నవ్వే చాలు, వజ్జర వొయిడూర్యాలు!

అవేం తక్కువ ప్రలోభాలు కావు... దానికి తోడు అతన్ని ఆ రాత్రి కాలేజీనుంచే కాకినాడ బొమ్మని సాగనంపేసి—తనవేపు వేలు చూపించి గుసగుసలాడి, అంతలోనే తన దగ్గిరకొచ్చి "మా యింటికి దయచెయ్యాలండి మాస్టారూ, తమరు! ఇప్పుడే ఇలాగే!!" అని ఆదర-హాస-పూరిత ఆహ్వానం. ఆ దరహాస పూరిత ఆహ్వానం అసలే తక్కువ ప్రలోభం కాదు.

కోటకి వెనకవేపున, కొంచెం రద్దీతక్కువగా వుండే వీధిలో, పురాతనమైన ఒక పెంకుటింటి ముందు రెండు రిక్షాలు ఆగాయి. వీధి గుమ్మం ప్రహారీగోడ,

అక్కడున్న ఖాళీ స్థలం, మొదటి వరండాగది, పాతదనమో సంప్రదాయ వైభవమో తెలియనంత గజిబిజిగా తోచాయి రాఘవులికి.

వరండాగదిలో మూడు ఖాళీ కుర్చీలు, ఒక టేబిల్ ఫ్యాను. దాని కెదురుగా పడకుర్చీలో వొక ముసలమ్మ ఆవిడ అస్పష్టంగా గొణుగుతున్నట్టే వున్నా, అది కృష్ణకర్ణామృతంలోని శ్లోకమేనని గుర్తుపట్టాడు రాఘవులు.

అందుకోసం అక్కడే నిలిచిపోయిన రాఘవుల్ని, "రండి మాష్టారు, లోపలికి రండి" అని చెయ్యి పట్టుకుని ఆహ్వానించింది. "మా అమ్మమ్మ...కళ్ళు ఆనవు..." అంది.

"ఎవరే, ఉలూచీ?" అడిగింది ముసలమ్మ

"అయ్యవారమ్మమ్మా!" అని కంఠంలో ప్రసన్నతే వుంచి, కళ్ళలో విసుగు చూపింది. "లోపలికి!" అన్నట్లు రాఘవులికి సంజ్ఞ చేసింది.

ఉలూచి!

ఉ...లూ...చి!!

"నీ పేరు—"

"ఉలూచి..." కనురెప్పలల్లారుస్తూ, నవ్వుతూ, ఉలూచి....

"......నాకెంతో ఇష్టం...... విజయ విలాసంతో చేమకూర వెంకట కవి చెప్పినట్టు—రూప విభ్రమ రేఖా ఖనులెంపు నాగ కన్యలె!" అన్నాడు రాఘవులు, "ఈ కలహంసయాన నను నెక్కడి కెక్కడినుండి దెచ్చె!" అని ఆవిభ్రమం అంతా అనుభవిస్తూ.

"అంతేగాదండి. మేం నాగ వంశీయులం కూడా నండి." అంటూ ఆ లోపలి గది పక్కగావున్న మరోగదిలోకి అడుగు పెట్టింది ఉలూచి.

"స్మర దివ్యాగమ కోవిదుల్ మదన శిక్షా తంత్ర విద్యావిదుల్; సురతారంభ మహోద్వృత్త ప్రవీణులు—అని శ్రీనాథ మహాకవి క్రీడాభిరామం అనే గ్రంథంలో చెప్పేడు మీ వాళ్ళకు కావలసిన పురుషుల్ని గురించి—" అన్నాడు రాఘవులు.

ఉలూచి నవ్వి లోనికి దయ చేయండి-" అంది.

ఆగదిలో అడుగు పెడుతూ, దాని వైలక్షణ్యాన్ని గమనించేడు రాఘవులు.

మరో గదిలో అడుగుపెట్టినట్టుకాక, మరోలోకంలోనే అడుగుపెట్టినట్టుంది....!

ఇంతకుముందు ఈ ఇంట్లోనే చూసిన గదులకీ, దీనికీ ఏమాత్రం పోలికాలేవుగాక లేవు!

దీన్ని కేళీ మందిరం అనాలా, కళా భాండారం అనాలా, లేక ఏ శ్రీనాథ మహాకవినో అడిగి దీనికొక నూతన నామాన్ని నుడికారం చెయ్యాలా అని ఆలోచిస్తూనే "అయితే మీరు, నిజంగా యిప్పటికీ—?" అన్నాడు.

"అవునండి. చెప్పేను కదండి. మేం నాగ వంశీయుల మేనండి. తరతరాలుగా ఇదే విద్యండి, ఇదే జీవికండి మాకు. మీ కిందాక కనిపించిన మా అమ్మమ్మ, రెండేళ్ళ కిందట రంభాత్వం పొందిన మా అమ్మ, గత ఏడెనిమిది నెలలుగా రావు అప్పారావుగారి ఇల్లాల్నిగా వుంటున్నా నేను కూడా నండి, మేం అందరమూ నండి, శూద్రక మహాకవి సృజించిన వసంతసేన వారసులమే నండి."

ఆ గది దక్షిణపు గోడ మీద ఎత్తుగా వున్న చోట అందంగా వ్రేలాడుతున్న



రెండు తైలవర్ణ చిత్రాలు చూపింది ఉలూచి " మా అమ్మమ్మా నండి మా అమ్మా నండి... ఈ బొమ్మ సాక్షాత్తు దామెర రామారావుగారే దయచేయించా రటండి."

అలా తలతిప్పి మిగిలిన గోడలూ చూశాడు రాఘవులు.

రవివర్మ చిత్రించిన మేనక, దమయంతి హంసక్రీడ-ముద్గల్‌కర్ రూపొందించిన రతీమన్మథ, శివపార్వతి, జపాన్ నుంచి దిగిన నగ్నసుందరీమణుల బొమ్మలు, రంగులలో అచ్చయినవి, భారీ ఫ్రేముల్లో బిగించివున్నాయి.

"బొమ్మలు బాగున్నాయేమండీ?" అని అడిగింది ఉలూచి.

"నిజంగా చాలా బాగున్నాయి. వీట్లో చాలామట్టుకు అక్కడా అక్కడా చూసి నవేగానీ, ఇంత కళాత్మకంగా వీటిని భద్రపరిచే యిళ్ళుంటాయని తెలిదు"

"ఎప్పుడూ ఎవ్వరింటికీ వెళ్ళ లేదన్న మాటండీ?" అని నవ్వింది ఉలూచి.

"వెళ్ళకపోవడం అనేది అర్హతా, అన ర్హతా?"

"నేనేం చెప్పినా మీకు నచ్చక పోవచ్చు నండి."

"ఔనౌను!" అని రాఘవులు. "మరి ఇందులో ఉలూచీ అర్జునుడూవున్న బొమ్మ లేదేం?"

"అందులో లేదుగానండి," అని కొంటెగా నవ్వింది ఉలూచి, 'ఇందులో ఉందండి' అని, డ్రెసింగ్ టేబిల్ సొరుగులాగి, దాంట్లోంచి ఒక ఫొటోఫ్రేమ్ తీసింది. అది తైల చిత్రమూకాదు, వర్ణ చిత్రమూ కాదు, ఛాయాచిత్రం. కాకినాడలో ఫలాని స్టూడియోవారు తీసినది-దాంట్లో ఉలూచి ఉందికాని ప్రక్కనఉన్నవాడు అర్జునుడు కాదు. అప్పారావు.

వాళ్ళ యిద్దరి పెళ్ళిగురించి చెప్పింది. అతను మూడువేల ఆరు వందల రూపా యలు చెల్లించి, ఐదుకాసుల బంగారం పెట్టి తన కులం స్త్రీల సమక్షంలో తాళికట్టాడు. ఏడాదిపాటు అతను వచ్చిపోతూ ఉండ వచ్చు. అలా అని, ఇతరులు రాకూడ

దన్న నిబంధనలేదు. కానిస్త్రీతర మొదటి బిడ్డ ఆతగాడిది అవడం తనకి జయమట, అభిలాషానట!

"కూర్చోండి" అని, ఆగదిలోకి తాము వచ్చిన ద్వారాన్ని మూసి, మరో తలుపు తెరిచి, 'కళావతీ' అని కేకేస్తూ లోపలికి వెళ్ళింది ఉలూచి.

పాతకాలపు పట్టిమంచం. దానిమీద ఎత్తయిన పీచు పరుపు. దాని మీద వొత్తయిన బూరుగుదూది పరుపు ఆపైన ముదురు రంగులోవున్న షోలాపూర్ కలంకారీ దుప్పటి. ఓ వైపున రెండు పెద్ద పెద్ద దిండ్లు కాళ్ళదిక్కున, తలదిక్కున కూడా రెండు గోడలకీ పెద్ద పెద్ద బిళువారి అద్దాలు. దోమతెర కట్టుకోవడానికి పందిరి. దానికి పైగా సీలింగ్ ఫ్యాన్.

మంచానికి తలదిక్కున డ్రెసింగ్ టేబిల్ దానిమీద క్లుప్తంగా అంకారసామాగ్రి, పరిమళ సంభారం. మంచానికి కాళ్ళ వైపున ఒక పక్కగా చిన్న మేజా. దాని మీద వొక ఇత్తడి పళ్ళెంలో అచ్చం పింగాణివి వొక యాష్ ట్రే ఆపక్కన రాజదర్బార్లలో వుండేవి కాబోలని నమ్మే రకం పాతకాలపు సౌఖ్యదాయకమైనకుర్చీ ఏవందయేళ్ళకిందటిదో ఉలూచిఅమ్మమ్మ గారికి అమ్మమ్మగారి అలనాటి పత్నీవాయి రాజావారో లేక వారి బంధువో ఇచ్చారు గావుననిపిస్తుంది, దాని పనితనం, నిర్మాణాత్మకక్రమం చూస్తే. చేతులు, కాళ్ళూ, వీపూ, సీటూ అన్నీ ఉత్కృష్టమైన దారుశిల్పానికి ఉదాహరణలుగా పేర్కొనదగ్గ డిజైన్ల మయంగా ఉన్నాయి.

మంచానికి కాళ్ళ వైపున పొడవైన, ఎత్తయిన అరలులేని టేబిల్. దానిమీద ఒక పీఠ దానిమీద సన్ననిదైన చిక్కని చక్కని తెల్లని ఆఛ్ఛాదన.

తాము ప్రవేశించిన ద్వారానికీ ఉలూచి నిష్క్రమించిన ద్వారానికీమధ్య గోడలో ఒక అద్దాల బీరువా. దాని మూడు అరల నిండా పుస్తకాలు.

అద్దాల్లోంచిచూసి పుస్తకాలెల్లాంటివో పరికరించాలని రాఘవులు వంగి నిల్చున్న సమయంలో, చేతిలో కంచుగ్లాసు పుచ్చుకుని వచ్చింది. ఉలూచి. "కొబ్బరిసీళ్ళు" పుచ్చుకోండి పాలు కాగుతున్నాయండి. మీరు టీ అంటే టీ, కాఫీ అంటే కాఫీ!... ఆగండి, తాళం తీస్తాను!"

o..............o.. ....o

"మా అమ్మ ఎంత తాపత్రయంపడ్డానండీ, నాకు సంగీత సాహిత్యాల్లో కొంచెమైనా ప్రవేశం దొరికింది గాని నాట్యం మాత్రం పట్టు ఒళ్ళేదండి పల్లెకాక, పట్నంకాక, మధ్యస్థంగావున్న ఈఊళ్ళో మమ్మల్ని పాత పద్ధతి ప్రకారం ఒక్కళ్ళెవ్వరో పోషించే రాజుల రోజులు కావండి. ఇప్పుడంది, చచ్చిపోతున్న ఈ సాంప్రదాయాన్ని పట్టుకు వేళ్ళాడుతున్న నాబోటి వాళ్ళకు చదువూ ఆటాపాటా సరిపోవటం లేదండి. అందం వుండాలండి, ఒగలు కురవాలంచి, అవను దొరికితే మోసం కూడా చెయ్యాలండి. కొద్దిగా నాట్యంనేర్చిన మాత్రంచేతనే మాపెత్తల్లి చిత్తజల్లు పుల్లయ్యగారి దినాల్లో ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవడానికి సాహసించింది కనుకా పెద్ద సినిమాతార అయిపోయి బాగా సంపాదించుకుని గౌరవంగా దర్జాగా బతికిందండి. ఇక్కడుండిపోతే పూట

బత్తెం పుల్ల వెలుగే కదండి?"
ఆ కథలన్నీ విని,
ఆమె చదివిన ఆ గ్రంధాలేమిటో తెలుసుకొని, వాటిల్లో స్వారస్య ప్రధానమైన ఘట్టాలూ కవి సమయాలూ చర్చించి ఆమె ఆవాతావరణంలో నింపిన సంగీతాన్ని ఆస్వాదించి-
గడియారం చూసుకున్నాడు రాఘవులు.
వీణను తిరిగి టేబిల్ మీద దాని స్థానంలో వుంచి మంచం దిగింది, ఉలూచి.
మంచం మీది దుప్పటిని తీసేసి మంచం క్రిందవున్న పెట్టెలోంచి తెల్లని చాకింటి దుప్పటి తీసి, దులిపి, పరచింది. "మీరు ఆ కుర్చీలోంచి లేచి కాసేపు ఈ మంచం మీద విశ్రాంతి తీసుకోండి మాష్టారూ! మీరు పుచ్చుకుంటానంటే మళ్ళీ టీ ఇస్తానండి...లుంగీ కానీ పంచెగానీ ఇమ్మంటా రాండీ కట్టుకోటానికి?"
రాఘవులు లేచాడు. కళ్ళు సన్నగా చేసి ఉలూచిని పరీక్షగా చూసేడు.
"మీతో ఈ పూట గడపడానికండీ అప్పారావుగార్ని పంపిచేశానండి. వారి అనుమతే పొందానంటి ఎలాయెకి! మీరేమీ శంకించనే అక్కర్లేదండి." అంది ఉలూచి నవ్వుతూ "వారి పని సానుకూలం కావడం నాకు ఇష్టమూ అవుసరమూ కూడా కనక నండి, అది మీ ద్వారా నెరవేరింది కనకా నండి-"
రాఘవులు ఆ చనువును విభ్రమతో చూశాడు.
"ఒక రహస్యం చెప్పేస్తానండి. ఆ రోజు రైల్లో మీ ఎదురుగానే వారు నన్ను అమితంగా లాలించేరు కదండి, ఓసారండీ, నా చెవిలోకి వంగి, ఉలూచీ నీ చేష్టలతో ఆయన్నెంత వేడెక్కిస్తున్నావో తెల్సా" అన్నారండి! అంటే ఆ మాటకి నే నేమన్నానో తెలుసాండీ?"
"ఊఁ!"
"ఊఁ! యేంటండి! నే నే మ న్నా నో తెలుసాండీ?...ఎప్పుడో ఓరోజు వెతిగి పట్టుకుని కాక తీర్చేస్తా నన్నానండి" అని కుడిచేతి చూపుడు వేలితో అతని గుండె మధ్య భాగాన్ని పొడిచింది ఉలూచి.
అంతలోనే చాలా ఆత్మీయమైన ధోరణి తెచ్చుకుని "చాలా మంచివారండి, వారు మరొ రైతే ఆ మాటకి నన్నక్కడే నరికేసే వారేమో?"
"ననవిల్తు శాస్త్రంబు మినుకు లావర్తించు పని వెన్నతోడ బెట్టిండి మాకు" అని వరూధిని ప్రవరుడికి చెబుతున్న దృశ్యం కళ్ళకి కట్టింది రాఘవులికి.
అతనికి పూర్తిగా అర్థమైంది.
చాప చిరిగినా చదరంత.
ఈ ఊళ్ళో మాత్రం ఇంకా స్వల్పంగా మిగిలివున్న ఈ కళాస్వరూపాల నైపుణ్యాన్ని పరిశీలిద్దామని, చాతుర్యాన్ని చవిచూద్దామని, ఈ దూరపు కొండల నునుపును స్పృశిద్దామని ఎక్కడెక్కడి నుంచో రసికులు వస్తూనే ఉన్నారని "సామాన్య"లే అయినప్పటికీ "పరకీయలా!" అనిపించేటంత భ్రమ కలిగించి శృంగార రస పరాకాష్ఠను సాక్షాత్కరింప చేస్తున్న వీరి పొందు విందై వెలుతున్నారని-కొద్దిరోజుల క్రితమే విన్నాడతను.
అతనికి-
నిన్న రాత్రి అంతకు ముందు మరో

అయిదు వందలతోంభై రాత్రులు కలిగిన ఆశాభంగాలున్నూ గుర్తుకొచ్చాయి.
ఒక్కొక్క జావళి పాడుతున్నప్పుడు మనోహరంగా కదిలిన ఆమె పెదవులు, వీణ వాయిస్తూ ఉంటే రమ్యంగా కదిలిన ఆమె కన్నులు-తానింతకు ముందు ఎన్నడూ ఎక్కడా పొందనిది, కోరినది అనుభవం ఇదే ఇదే అని పదే పదే చెప్పాయి.
అయినా సరే-
పారిశ్రామికీకరణంవల్ల సంభవించి నిమిష నిమిషానికీ ఉధృతమౌతున్న ద్రవ్యోల్బణం ప్రభావంచేత అన్నిరకాల ఆనందాల కాల పరిమితీ కుదించుకు పోయి అనుభవం యాంత్రికమై పోయి నట్టు అతనికి అవగాహన అయింది
మొదట్లో కళగా అవతరించి తనకంటూ ప్రత్యేక సంకేతాలను ఆరాధ్య దైవ స్వరూపాలను ఏర్పరచుకొన్న శృంగారం మీద మతం, రాజకీయం తమ ప్రభావాన్ని చూపాయి. శృంగారం రంగులు మార్చి సెక్స్ అయింది. కళ కాస్తా సైన్స్ అవతారం దాల్చింది. ప్రశ్నోత్తరాల స్థాయి కొచ్చింది.అయినా సరే పాపంగా, నేరంగా పరిగణించబడు తూనే వుంది.
ఈ పరిస్థితి కిక్కడ చోటు లేకపోవ డమే ఈ సీమ ప్రత్యేకత, ఇది మహా నంద సీమ. ఇది మనోల్లాస సీమ.
కాని ఈ పురుషార్థాన్ని రాఘవులు

రు. 80,000 విలువైన బహుమతులు గెలవండి!

5	10	3
4	6	8
9	2	7

(మాదిరి మొత్తం 18)

ఎంట్రీ ఫీ లేదు. మొదట వచ్చిన 5 ఎంట్రీలకి ఉచితంగా మిక్సర్ పొందుతారు.
బహుమతులు : టి. వి లేక టేప్ రికార్డర్.
కన్సొలేషన్ బహుమతి : టూ ఇన్ వన్ నేషనల్ మోడల్ ట్రాన్సిస్టర్ 310/- విలువైంది 170/- లకే లభిస్తుంది. వ్యాపార అభివృద్ధి పథకం ఇది. 9 ఖాళీ గళ్ళను గీసి పై విధంగా అంకెలని 3 నుంచి 11 ఉపయోగిస్తూ ఎటుకూడినా మొత్తం 21 రావాలి. ఒక అంకె ఒకేసారి ఉపయోగించాలి. 15 రోజుల్లో ఎంట్రీలు చేరాలి.

NEW GENVA ELECTRONICS (M V.)
P. B. No. 136. Ambala_133001



ఎప్పుడూ ఒక ధర్మంగానే స్వీకరించాడు కనక అతను సంకోచంలోనే ఉండి పోయాడు.

"లుంగీ వుందా?"

"ఓ!" అని సెకండ్ల కాలంలో మంచం తలాపిన ఉన్న డ్రెసింగ్ టేబిల్ దిగువ భాగంలో ఉన్న అల్మారులోంచి ఘుమ ఘుమ లాడుతున్న మడత తీసి అందించింది ఉలూచి.

అతను చొక్కా తీసేసి "పాగా కొయ్య"కి తగిలించాడు. లుంగీ కట్టుకుని దాని లోపలనుంచి ప్యాంట్‌ను దిగవిడిచాడు "నేను వెంటనే దేహ బాధ తీర్చుకో వచ్చునా?"

"రామాయణం అంతా విని" అని నవ్వుతూ అతనికి దగ్గిరిగా వచ్చింది ఉలూచి. లోపలి మండువాలోకి తెరిచి ఉన్న తలుపుకి అడ్డంగా తెరలాగి "ఇంకా సందేహమాండీ?" అని అతని ఎదుటికి వచ్చి ఆనుకుని నిలబడింది. ఆ క్షణమే అతని మొహంలో రస భేదాలన్ని పసిగట్టి, నాలుక కరచుకుని "ఓ! అదా?" అని చెంగున గెంతి మండువాలోకి దారి తీసింది. అతనికి మరుగు స్థలం చూపించి గదిలోకి వచ్చేసింది.

o...............o...............o

రాఘవులు తిరిగి వచ్చే సరికి తెర తప్పించుకుని గదిలోంచి మండువాలోకి వస్తున్న "కళావతి" ఒంటినిండా పైట కప్పుకుంటూ, ముసి ముసి నవ్వులతో "వెళ్లండి బాబు" అంది.

రాఘవులు గదిలోకి ప్రవేశించడం తడవుగా ఉలూచి అతనికి సర్వంలా చుటే సింది.

ఆమె ఒంటిమీద వస్త్రాలు నామమాత్రం. ఆ గది అంతా సుగంధ పరిమళ భరితం.

ఏకాంతం.

అంగీకారం

ఆమోదం

ఆహ్వానం

అయినా భయం, సంకోచం, వేదన.

o.........o.......o..........o

ఆ క్షణంలో వచ్చి పడ్డా రాయింట్లోకి, శాంతిభద్రతల రక్షకులు' దండుకు దండూనూ.

o...............o...............o

హింస

దూషణ

అవమానం

అన్నీ వరసగా సంభవించేయి.

ఉలూచీ బాహు పరీ రంభం కాదది,

శృంగార సర్ప పరిష్వంగం......

[ఇందులోని కొన్ని వర్ణనలకు సమాచారం అందించిన మిత్రుడు సదాశివరావుకి కృతజ్ఞతలు]